క్లుప్తంగా

వీరభద్రుని సేవలో డీఆర్‌ఎం


ఆలయంలో డీఆర్‌ఎం దంపతులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్ర స్వామిని గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ విజయకుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఆలయ విశిష్టతను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు సత్కరించి మెమొంటోను అందజేశారు.

‘చెకుముకి’ టాలెంట్ టెస్ట్ పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న జేవీవీ సభ్యులు

పెనుకొండ: పట్టణంలోని ఘనగిరి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈ ఏడాదికి సంబంధించిన 8, 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జోన్ అధ్యక్షుడు నబీ, జిల్లా కార్యదర్శి హరి, రాజశేఖర్, బాబు, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన తర్వాత తొలిసారి పెనుకొండ వెళ్తూ మార్గమధ్యలో సోమందేపల్లిలోని వైఎస్సార్ విగ్రహానికి ఉషశ్రీచరణ్ పులమాల వేసి నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను ఘన స్వాగతం పలికారు. హిందూపురం, మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన శ్రీరాములు

రొద్దం: మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామ సమీపంలో పేరూరు - పెనుకొండ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు... ఆర్ లోచెర్ల గ్రామానికి చెందిన కురుబ శ్రీరాముల అనే వ్యక్తి ఎల్‌జీబీ నగర్ వద్ద రాచూరు వెళ్లడానికి ఆటో ఎక్కాడు. హిందూపురం నుంచి కర్ణాటక నాగలమడకలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్తున్న ఆటో కంచిసముద్రం గ్రామ సమీపంలో బోల్తా పడడంతో శ్రీరాములు రెండు కాళ్ల దెబ్బతిన్నాయి. మిగతా ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన శ్రీరాములును వెంటనే అనంతపురం అస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని మంచేపల్లిలో 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. పక్కా సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా నాసిర్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం అమ్ముతుండగా ఆదివారం అరెస్టు చేశామన్నారు. కోర్టుకు హాజరుపరచి అనంతరం రిమాండ్‌కు తరలించామన్నారు.

పరిగిలో...

పరిగి: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా 200 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా నిందితుడు తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండలంలోని పెన్నానదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టరును స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన అనంతరం కేసు నమోదు చేశామన్నారు.

వైద్యం అందక గేదె మృతి


మృతి చెందిన గేదె

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం దక్షిణ గొల్లహట్టిలో ఈరన్న అనే పాడి రైతుకు చెందిన గేదె సరైన వైద్యం అందక ఆదివారం మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఈరన్న తెలిపిన వివరాల మేరకు.. నెల రోజులుగా గేదె అనారోగ్యంతో బాధపడుతోందన్నారు. గేదెను తీసుకొని స్థానిక పశువైద్యశాలకు ఎన్నిసార్లు వెళ్లినా అక్కడ సిబ్బందిలేక పోవడంతో పశువుకు వైద్యం చేయించలేకపోయానని వాపోయారు. పశు వైద్యుడికి ఫోన్ చేస్తే మీటింగ్‌లో ఉన్నానని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే తన పశువు చనిపోయిందన్నారు. సకాలంలో వైద్యం అందించి ఉంటే బతికేదన్నారు. అధికారులు స్పందించి తనకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఏకదంతాయ .. బహు రూపాయ


రొళ్ల మండలం టీడీ పల్లిలో కొలువుదీరిన ఏకదంతుడు


సోమందేపల్లిలోని దుర్గానగర్ వెలసిన లంబోదరుడు


పరిగి: కాలభైరవ ఆకారంలో దర్శనమిస్తున్న గణనాథుడు


రొద్దం మండలం పోలేపల్లిలో పార్వతీతనయుడు


పరిగి మండలం బోరెడ్డిపల్లిలో 16 అడుగుల వినాయక విగ్రహం


హిందూపురం రైల్వేరోడ్డులోని వినాయకుడు


హిందూపురం: పళనినగర్‌లో బాలసుబ్రహ్మణ్య విఘ్నేశ్వరుడు


హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లిలో శివమూర్తి రామ గణపతి


అగళి మండలం నరసబుందిలో కొలువుదీరిన వినాయకుడు


హిందూపురం: కోట ప్రాంతంలోని రామ విశ్వ వినాయక సేవా గణేశుడు

వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ వాడవాడలా గణనాథుడి ప్రతిమలను కొలువుదీర్చారు. శనివారం ఉదయం నుంచే ఆయా మంటపాల్లోని వినాయకుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉండ్రాళ్లతో పాటు చెరకు గడలు, ఎలక్కాయలు, జాజిపూలు తదితర సామగ్రితో భక్తిశ్రద్ధలతో అర్చకులు పూజలు చేశారు. కొన్నిచోట్ల శనివారం సాయంత్రమే వినాయకుడిని స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. – సాక్షిబృందం


అమరాపురం: పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొలువుదీరిన బొజ్జ గణపయ్య



హిందూపురం: వాల్మీకినగర్‌లో త్రిముఖ గణపతి


హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లిలో మహాగణపతి


హిందూపురం: అంబేడ్కర్ నగర్‌లో పరశుధార గణేశుడు


హిందూపురం: కోటలో విద్య గణపతి


హిందూపురం: శూలధార గణపతి


హిందూపురం మండలం నింకంపల్లిరోడ్డులో సూర్యప్రకాశగణపతి


హిందూపురం మండలం మేళాపురంలో అభయ మహాగణపతి


లేపాక్షి మండలం కల్లూరులో పూజల్లో పాల్గొన్న గ్రామపెద్దలు


పెనుకొండ మండలం ఇస్లాపురంలో వెలసిన గణనాథుడు


సోమందేపల్లిలో అన్నదానం చేస్తున్న దృశ్యం


పావగడ: వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు షంషుద్దీన్ (89) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి, ఇషాక్, ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ తిప్పేస్వామి తదితరులు షంషుద్దీన్ స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళికి చెందిన చిక్క జాలోడు గ్రామంలో కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...గొర్రెల కాపరి సిద్ధలింగప్ప 20 గొర్రె పిల్లలను కళ్లంలో వదిలి గొర్రెలను మేతకు పొలాల్లోకి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా కొన్ని కుక్క పిల్లలు కంచెలోకి చొరబడి 15 గొర్రె పిల్లలను చంపేశాయి. మిగిలిన ఐదు గొర్రె పిల్లలు కుక్కల దాడి నుంచి తప్పించుకున్నాయి. సుమారు రూ.40 వేల నష్టం వచ్చిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని సిద్ధలింగప్ప వేడుకుంటున్నాడు.

రేపటి నుంచి ‘పొలం పిలుస్తోంది’

లేపాక్షి: మండలంలో ఈనెల 10వ తేదీ (మంగళవారం) నుంచి 26వ తేదీ వరకూ ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతి మంగళవారం, బుధవారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు పాల్గొనాలని విజయవంతం చేయాలన్నారు.

చిన్నారులకు బ్యాగుల పంపిణీ

పావగడ: పట్టణంలోని ఉప్పర వీధిలో ఉన్న అంగనవాడీ కేంద్రానికి చెందిన 20 మంది చిన్నారులకు స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త భూలక్ష్మి, సహాయకురాలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

- అధికారులకు చెప్పి విసిగిపోయామంటున్న ఆటోడ్రైవర్లు


గుంతలకు మట్టి వేసి పూడుస్తున్న ఆటోడ్రైవర్లు

గుడిబండ: గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో ఆటో డ్రైవర్లే రోడ్డు మరమ్మతుకు శ్రీకారం చుట్టారు. గుడిబండ, ఫళారం, దిన్నేహట్టి, మందలపల్లి, పీసీ గిరి వరకూ ఉన్న తారురోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై నిత్యం తిరిగే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుడిబండ నుంచి పీసీ గిరి గ్రామానికి చేరుకునేందుకు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. రోడ్డుపై ఏర్పడ్డ గుంతను పూడ్చి వేయాలని పంచాయతీరాజ్ అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆటోడ్రైవర్లు గుంతలున్న చోట మట్టిని వేసి తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఈరన్న, రఘు, కలేందర్, పరమేష్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉషశ్రీచరణ్‌కు ఘన స్వాగతం


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలి హోదాలో ఉషశ్రీచరణ్ తొలిసారి జిల్లాలోకి అడుగుపెట్టడంతో కొడికొండ చెక్‌పోస్టు వద్ద స్వాగత కార్యక్రమంలో పాల్గొన్న హిందూపురం, మడకశిర సమన్వయకర్తలు టీఎన్ దీపిక, ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్

హిందూపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన ఉషశ్రీచరణ్‌కు చిలమత్తూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపికా, నాయకులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన తర్వాత ఆదివారం తొలిసారి జిల్లాలోకి అడుగుపెట్టడంతో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రజాసేవలో నిమగ్నమవుతామని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఎన్నికల్లో టీడీపీ గెలిచినా నైతికంగా గెలిచి ప్రజల గుండెల్లో వైఎస్సార్‌సీపీ స్థానం సంపాదించుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా ప్రాధాన్యం కల్పించారని, ఇప్పుడు జిల్లాలో పార్టీ బాధ్యతలను మరోసారి మహిళకు ఇచ్చి జగనన్న మహిళా పక్షపాతినని మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, కౌన్సిలర్లు శివ, రామచంద్రా ఇతర నాయకులు పాల్గొన్నారు.

మడకశిర: వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను ఆదివారం మడకశిర నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. పెనుకొండలోని మాజీ మంత్రి స్వగృహంలో ఉషశ్రీచరణ్‌ను మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పార్టీ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ బలోపేతానికి పలు సూచనలు చేసినట్లు ఈరలక్కప్ప ఫోన్‌లో ‘సాక్షి’కి తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారన్నారు.

మడకశిర: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఆదివారం కొడికొండ చెక్‌పోస్టులో వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్‌కు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ త్వరలోనే మడకశిర నియోజకవర్గంలో ఉషశ్రీచరణ్ పర్యటించి నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని పేర్కొన్నారు. ఉషశ్రీ చరణ్ పర్యటన విజయవంతం చేసినందుకు నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య


పాలయ్య (ఫైల్)

పావగడ: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తాలూకాలోని నిడుగల్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. అరసికెరె ఎస్‌ఐ థారా సింగ్ తెలిపిన వివరాలమేరకు... నిడుగల్ గ్రామానికి చెందిన రైతు పాలయ్య (78) న్యాయదకుంటె కర్ణాటక గ్రామీణ బ్యాంక్, కోడిగెహళ్లి వీఎస్ఎస్ఎన్ సహకార సంఘంతో పాటు ప్రైవేటుగా రూ.7 లక్షల రుణాలు తీసుకున్నాడు. కొన్ని సంవత్సరాలుగా అప్పులు చేస్తూ వేరుశనగ పంట పెట్టినా నష్టం వాటిల్లుతోంది. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. అప్పులు తీర్చే మార్గం కనిపించక పంటలకు కొట్టే పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

సోమందేపల్లి: మండలంలోని నల్లగొండ్రాయనపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం బోల్తా పడి గంగాధర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం సోమందేపల్లి వైపు నుంచి తన స్వగ్రామమైన చిన్న బాబయ్యపల్లికు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. తలకు గాయం కావడంతో చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.